

సాక్షి ప్రకాశం

రేపటికి ముందడుగు



7

బుధవారం । 8 । మార్చి । 2023

న్యూస్‌రీల్

మహిళలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని కోరుతూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అమలు పరుస్తున్న నవరత్నాల పథకాలు అన్నీ మహిళలకే వర్తించేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని, అమ్మ ఒడి పథకం ద్వారా అక్క, చెల్లెమ్మల అకౌంట్‌లలో నేరుగా డబ్బులు జమ చేస్తున్నారని చెప్పారు. జగనన్న కాలనీలలో ఇంటి స్థలాలు మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నారని, మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి కీలకం అని నమ్మే సీఎం అన్ని పథకాల ద్వారా కలిగే లబ్ధిలో 75 శాతం (రూ.2.44 లక్షల కోట్లు) మహిళలకే అందిస్తున్నారని, క్యాబినెట్‌లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి కీలకమైన పదవుల్లో నియమించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

నమో వెంకటేశాయ..

- వేడుకగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వెలుగొండ (కొనకనమిట్ల): నమో వేంకటేశాయా నమోనమః అంటూ జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీలక్ష్మీ అలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు వెంకటాచార్యులు, ప్రసాదాచార్యులు, సింహాద్రిచార్యులు స్వామి వార్లకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంకురార్పణ కార్యక్రమంతో మొదలైన 19న జరిగే పూర్ణాహుతి, చక్ర తీర్థం, వసంతోత్సవంతో ముగుస్తాయన్నారు. నిత్యం శ్రీవారికి ఉత్సవాలు నిర్వహించటంతో పాటు 15, 16, 17 తేదీలలో రాష్ట్రస్థాయి పశు ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి ఆలయం, పీఠమీద లక్ష్మమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

అనాథ బాలుడిని దత్తత తీసుకున్న విదేశీ వనిత

- దత్తత ధ్రువీకరణ పత్రం అందజేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సెరా(సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) హోంలో ఉంటున్న అనాథ బాలుడిని ఓ విదేశీ మహిళ దత్తత తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ప్రకాశం భవనంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత తీసుకున్న కెనడాకు చెందిన ట్రేసీకి కలెక్టర్ దినేష్ కుమార్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ట్రేసీ కెనడాలో ఒంటరిగా ఉంటూ సొంత వ్యాపారం చేస్తున్నారు. దత్తత కోసం 2019లో సెరా(సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన గోపీనాథ్ అనే బాలుడిని కలెక్టర్ ఆధ్వర్యంలో ట్రేసీకి అప్పగించారు. బాలుడికి మంచి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా పెంచాలని విదేశీ మహిళకు కలెక్టర్ సూచించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, సెరా హోమ్ అధికారి జొనాథన్, సీడబ్ల్యూసీ సభ్యులు నీలిమ, వంశీలత పాల్గొన్నారు.

ఆమె పాదాలు నవ సమాజ సృష్టికి సంకేతం
ఆమె ఆలోచన ఆర్థిక పరిపుష్టి సాధన మార్గం
ఆమె తెగువ కష్టాల సుడిని దాటగల శక్తి
ఆమె ధైర్యం సృష్టికి మూలాధారం
ఆమె కోమలత్వం హృదయ రాగాల మధురిమ
ఆమె కోపం ఎండలో కరిగే హిమం
ఆమె ప్రేమ విశ్వమంత
ఆమె చిరునవ్వు నిశీథిలో తారల వెలుగంత!

నింగీ..నేల నీవెంటే...



ఎ.భారతి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి



మలికా గర్గ్, ఎస్పీ



గంగాడ సుజాత, మేయర్



డాక్టర్ సనా మాధురి



ఊరులో అధికారిగా..పోరులో అధినేత్రిగా..ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ నిబ్బరంగా నిలుస్తూ.. ఆశయ సాధనలో ఎన్నో సవాళ్లకు ఎదురొడ్డి.. సంకల్పమే శ్వాసగా సాగిపోతూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్న ఆడవాళ్లూ మీకు జోహార్లు అంటోంది ఈ లోకం. నీ వెంటే నడుస్తామంటోంది. అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్న స్త్రీమూర్తులకు తగ్గ గౌరవాన్ని కట్టబెడుతున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అన్ని రంగాల్లో వారికి పెద్దపీట వేస్తున్నారు. జిల్లాలో ప్రతిష్టాత్మకమైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ పదవులను మహిళలకు కట్టబెట్టారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణకు మహిళనే ఎస్పీగా నియమించారు. ఇవే కాదు ఎన్నో పదవుల్లో అగ్రతాంబూలమిచ్చారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలపై ప్రత్యేక కథనం...

- జిల్లాలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత
- అధికార పదవుల్లో 50 శాతానికి పైగా
- స్థానిక సంస్థల్లో 50 నుంచి 60 శాతం పదవులు
- జిల్లా, ఒంగోలు నగర ప్రథమ పౌరులిద్దరూ మహిళలే
- జిల్లా ఎస్పీగానూ మహిళను నియమించిన వైనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా ప్రథమ మహిళ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ.. ఒంగోలు నగర ప్రథమ మహిళ, నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత.. లా అండ్ ఆర్డర్‌ను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎస్పీగా మలికా గర్గ్.. ఇలా ఎన్నో కీలక పదవుల్లో మహిళలకు కీలక బాధ్యతలు అప్పజెప్పారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్లుగా ఇరువురు మహిళలకే కేటాయించి అందలం ఎక్కించారు. వారిలో ఒకరు సింగరాయకొండ జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.అరుణ కాగా రెండో మహిళ మార్టూరు జెడ్పీటీసీ సభ్యురాలు చుండి సుజ్ఞానమ్మ. డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్‌గా రావి పద్మావతి రామనాథం బాబు, జిల్లా లైబ్రరీ చైర్‌పర్సన్‌గా ఆర్.వెంకట సుశీల, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి చైర్‌పర్సన్‌గా శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బత్తుల పద్మావతితో పాటు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కులాల కార్పొరేషన్లకు చైర్మన్లుగా, డైరెక్టర్లుగా మహిళలనే కేటాయించి గుర్తింపు తీసుకొచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే సగం కాదు మహిళలకు సగం కంటే ఎక్కువ పదవులు కట్టబెట్టి మహిళా పక్షపాతిగా నిలిచారు సీఎం జగన్.

సంక్షేమ పథకాల్లోనూ అగ్రతాంబూలం..

ప్రభుత్వం పదవులతో పాటు పలు సంక్షేమ పథకాల్లోనూ అతివలకే అగ్రతాంబూలమిచ్చారు. చివరకు ఇళ్ల పట్టాలు కూడా మహిళల పేరుమీదనే ఇచ్చారు. వాటితో పాటు అమ్మ ఒడి, డ్వాక్రా గ్రూపు మహిళలకు బ్యాంకు లింకేజీ కింద సున్నా వడ్డీ, సబ్సిడీలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు బ్యాంకు రుణాలు, ఇన్సెంటివ్‌లు, జగనన్న పాల వెల్లువ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఉపాధి కూలీలుగా మహిళలకు ప్రథమ అవకాశం ఇలా చెప్పుకుంటూ పోతే..ఎన్నో..ఎన్నెన్నో అవకాశాలు.

జిల్లాలో స్థానిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం...

హోదా	మొత్తం సంఖ్య	మహిళల సంఖ్య
జెడ్పీ చైర్‌పర్సన్	1	1
జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌లు	2	2
జెడ్పీటీసీ సభ్యులు	55	34
మండల పరిషత్ అధ్యక్షులు	53	32
ఎంపీటీసీ సభ్యులు	718	412
గ్రామ పంచాయతీలు	1011	554
గ్రామ పంచాయతీల్లో వార్డులు	10,076	5458

ఆత్మవిశ్వాసంతో ముందడుగు : ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసినప్పుడే విజయం సాధిస్తారని ఎస్పీ మలికా గర్గ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడారు. జిల్లాలోని మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాటల్లోనే..ఆధునిక మహిళలు అన్నీ రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారు. విద్యా ఉద్యోగ, వ్యాపారాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. నేను మహిళను.. ఈపని చేయగలనా ! అని అనుకోకుండా పట్టుదలతో పనిచేస్తే లక్ష్యాన్ని సాధించగలుగుతారు. మన సమాజంలో అమ్మాయిల పెంపకం విషయంలో ఉన్న కట్టుబాట్ల కారణంగా జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోలేకపోతున్నారు. అమ్మాయిల పెంపకం విషయంలో తల్లిదండ్రులు ప్రొటెక్షన్ ఇవ్వాలి కానీ ఓవర్ ప్రొటెక్షన్ ఇవ్వకూడదు.

ప్రేమ పేరుతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

ప్రేమ పేరుతో జీవితాలను నాశనం చేసుకోవద్దు. ప్రేమ, పెళ్లి అంటూ ఇల్లు వదిలి వెళ్లిపోవడం చాలా ప్రమాదం. కోరి ప్రమాదంలో పడి అమూల్యమైన జీవితాల్ని పాడుచేసుకోవద్దు. అనేక మంది బాలికలు ఆన్‌లైన్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌ల ద్వారా సులువుగా మోసపోతున్నారు.

వర్కింగ్ ఉమెన్‌ల మీద అదనపు భారం

వర్కింగ్ ఉమెన్‌ల మీద అదనపు భారం చాలా ఉంటుంది. ఉద్యోగ బాధ్యతలతో పాటుగా ఇంటి బాధ్యతలు కూడా తనే చూసుకోవాల్సి వస్తుంది. పిల్లలు, ఇంటి బాధ్యతలను భార్యాభర్తలు ఇద్దరూ సమానంగా పంచుకోవాలి. కుటుంబమంతా ఆమెకు పూర్తి స్థాయి ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. అనేకమంది మహిళలు పనిచేసే చోట వేధింపులకు గురౌతుంటారు. అలాంటి వారిని ఉపేక్షించకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

విప్లవాత్మక నిర్ణయం

మహిళల భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మక చర్యలను తీసుకుంటోంది. సచివాలయాల్లో మహిళా పోలీసులను నియమించడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంత మహిళలు అందుబాటులో ఉన్న మహిళా పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. అలాగే ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, రిజిస్టర్ చేసుకోవాలి. అత్యవసర సమయాల్లో దిశ యాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కి పోలీసుల సహాయాన్ని పొందవచ్చు.

తల్లి ఎయిర్ హోస్టెస్..బిడ్డ డ్రమ్స్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్..



తల్లిదండ్రులతో శిల్పకళ

ఒంగోలు నగరంలోని కబాడిపాలేనికి చెందిన డేటా శిల్పకళ ఎయిర్ హోస్టెస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు కేకే.రత్న కుమారి, తండ్రి శామ్సన్‌లు ఇరువురూ తహశీల్దారులుగా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న శిల్పకళ ఎయిర్ ఇండియాలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కుమార్తె 12 ఏళ్ల సియోనా కెఫీరా డ్రమ్స్ వాయించడంలో ఎనిమిది విభాగాల్లో అత్యంత ప్రతిభను కనబరిచి 2022లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా శిల్పకళ మాట్లాడుతూ ఆడ పిల్లలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. వారికి రక్షణగా ఉండి మద్దతు ఇస్తే చాలని చెప్పారు. హైదరాబాద్‌లో మొట్ట మొదటి సారిగా నిర్వహించిన ఎయిర్ షోలో ఎంపికయ్యానని తెలిపారు. తన తల్లిదండ్రులతో పాటు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనను ఎంతగానో ప్రోత్సహించారన్నారు.



మరిన్ని కథనాలు 8లో..

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా ప్రభుత్వ పాలన సాగిస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి తీసుకురాని సంస్కరణలను తీసుకొచ్చి మహిళలకు భరోసా ఇస్తున్నారు. రాష్ట్రంలో అన్ని పదవుల్లో మహిళలకు 50 నుంచి 60 శాతం వరకు పదవులిచ్చి గౌరవిస్తున్నారు. అంటే పురుషులకంటే స్త్రీలకు అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చి ఆదుకుంటున్నారు. సామాజికంగా, ఆర్థికంగా ఎదగటానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. మహిళల రక్షణ కోసం దిశా పోలీస్ స్టేషన్‌లు, ప్రమాద స్థలానికి పోలీసులు వెంటనే చేరుకోవటానికి దిశా యాప్‌ను మహిళలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పారిశ్రామిక రంగంలోనూ పురుషులతో సమానంగా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ప్రోత్సహిస్తున్నారు. కోట్లాది రూపాయలు ఇన్సెంటివ్‌లు ఇచ్చి అండగా నిలుస్తున్నారు.

– బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

మహిళలకు రక్షకుడుగా సీఎం వైఎస్ జగన్..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలకు రక్షకుడుగా పరిపాలన చేస్తున్నారు. ఆడపిల్లలను చదివించాలంటూ ప్రత్యేకంగా తల్లులకు అమ్మఒడి పథకం ద్వారా ఏటా వారి బ్యాంకు అకౌంట్లలో డబ్బులు వేస్తున్నారు. చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకొని సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికలు సిద్ధం చేసి మహిళలను ప్రోత్సహిస్తున్నారు. మహిళలు ప్రతి రంగంలో రాణించేలా ప్రతి పథకంలో వారికి సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తున్నారు. మా లాంటి వారికి మేయర్ పదవులను, నగర పాలక సంస్థల్లో, మున్సిపాలిటీల్లో, నగర పంచాయతీల్లో మున్సిపల్ చైర్‌పర్సన్లుగా, కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా కూడా అవకాశాలు కల్పించి రాజకీయంగా ప్రోత్సహించారు.

– గంగాడ సుజాత, ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్

11 ఏళ్లుగా రిమ్స్ అత్యవసర సేవల్లో విధులు...

డాక్టర్ సనా మాధురి ఒంగోలు రిమ్స్ వైద్యశాలలోని అత్యవసర విభాగంలో (క్యాజువాలిటీ) సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. 11 సంవత్సరాలుగా క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)గా విధులు నిర్వర్తిస్తున్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో రిమ్స్ వైద్యశాల అత్యవసర సేవల విభాగంలో పనిచేస్తున్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన డాక్టర్ సనా మాధురి 2011లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 2014లో ఒంగోలుకు వచ్చిన డాక్టర్ మాధురి కొంతకాలం మెడికల్ కళాశాలలో విధులు నిర్వర్తించారు. ఆ తరువాత రిమ్స్ హాస్పిటల్‌కు వచ్చిన మాధురి అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎమర్జెన్సీ సేవల్లో ఉంటూనే రేయింబవళ్లూ విధులు నిర్వర్తిస్తున్నారు. భర్త మల్లిఖార్జున రావు కూడా రిమ్స్‌లోనే సైకియాట్రిస్ట్‌గా పనిచేస్తున్నారు.

– డాక్టర్ సనా మాధురి, ఒంగోలు రిమ్స్ వైద్యశాల

ఉచిత న్యాయ సహాయం

మహిళలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల ఆదాయంతో సంబంధం లేకుండా వారికి న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. న్యాయ సహాయం అవసరమైన మహిళలు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి తగు సహాయాన్ని పొందాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

– ఎ.భారతి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జులు వీరే

ఒంగోలు:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జోనల్ ఇన్‌చార్జులు 17 మంది జాబితాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాలను కలిపి ఒక జోన్‌గా పేర్కొన్నారు. ఈ మూడు జిల్లాల నుంచి మొత్తం 17 మందిని 17 విభాగాలకు జోనల్ ఇన్‌చార్జులుగా ప్రకటించారు. ప్రకాశం జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షునిగా యర్రగొండపాలేనికి చెందిన పత్లావత్ రాములు నాయక్ పేరును ప్రకటించారు.

విభాగం	జోనల్ ఇన్‌చార్జి	నియోజకవర్గం
యువజన విభాగం	పిన్నెల్లి వెంకట రామిరెడ్డి	మాచర్ల
రైతు విభాగం	ఎం.సుబ్బారెడ్డి	ఒంగోలు
బీసీ సెల్	బొట్ల రామారావు	కొండపి
వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్	కాసిని వెంకట సుధాకర్‌రెడ్డి	ఒంగోలు
పంచాయతీరాజ్ విభాగం	వాకా వెంకటరెడ్డి	కొండపి
ఎస్‌టిసెల్	పాలపర్తి వెంకటేశ్వరరావు	నరసరావుపేట
మైనార్టీ విభాగం	సయ్యద్ జలీల్	ఒంగోలు
విద్యార్థి విభాగం	గొంగుల మనోహర్ యాదవ్	నరసరావుపేట
వికలాంగుల విభాగం	శ్యామ్ మలపోలు	వై.పాలెం
వైఎస్సార్ సేవాదళ్	మండ్ల రాజేష్‌కుమార్	గూడూరు
వైద్య విభాగం	డాక్టర్ సీహెచ్ జీవన్	ఒంగోలు
వాణిజ్య విభాగం	మాశెట్టి వెంకటేశ్వర్లు (బుజ్జి)	గురజాల
సాంస్కృతిక విభాగం	బొట్ల సుబ్బారావు	ఒంగోలు
ప్రచార విభాగం	కన్నా హనుమంతరావు	పెదకూరపాడు
మహిళా విభాగం	బడుగు ఇందిర	ఒంగోలు
గ్రీవెన్స్ విభాగం	పులుసు సురేష్	ఒంగోలు
చేనేత విభాగం	అవ్వారు అన్నపుశెట్టి	చిలకలూరిపేట

బ్యాలెట్ పేపర్ల పంపిణీలో లోపాలు రానీయొద్దు

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లు పోలింగ్ కేంద్రాల వారీగా చేసే పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ దినేష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనంలో బ్యాలెట్ పేపర్ల సీరియల్ నంబర్ల కేటాయింపు, పంపిణీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లను బండిల్ చేస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలిచ్చారు. పీవీఆర్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒంగోలు డివిజన్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు.

ఒక్కటిగా గంజాయిపై పోరు..



మాదకద్రవ్యాల నిర్మూలనే సంకల్పం - 8లో..

వరాలకొండకు.. వెలుగుల దండ



ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షిక తిరునాళ్ల మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. లక్షలాది మంది భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. 11 విద్యుత్ ప్రభలతో, విద్యుద్దీప అలంకరణలతో ఆలయ పరిసరాలు కాంతులీనాయి. - అద్దంకి

రంగుల కేళి..హోలీ



ఒంగోలు టౌన్: హోలీ వేడుకలు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు అంతా కలిసి రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. నగరంలోని రాజస్థాన్ వ్యాపారులు కేతశ్వర్ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మహిళల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కొత్తపట్నం వెళ్లి సముద్ర స్నానాలు చేశారు.

ఈ కామర్స్‌లో జోరు..



- డ్వాక్రా మహిళల ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో ట్రేడింగ్
- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలతో ఒప్పందం
- మెప్మా పరిధిలో 126, డీఆర్‌డీఏ పరిధిలో 35 ఉత్పత్తుల గుర్తింపు
- సోంచిరియా, కాల్ గుడి బ్రాండ్ల పేరుతో ఆన్‌లైన్‌లో విక్రయం



పార్శిల్ చేసిన తరువాత తీన్‌మార్ దోలక్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్న డ్వాక్రా సంఘాలు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో జోరుగా విక్రయిస్తున్నాయి. మహిళల ఆర్థికాభివృద్ధి అన్ని రకాలుగా చేయూతనందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళల ఉత్పత్తులను ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసుకునేలా చర్యలు చేపట్టింది. ఈ కామర్స్‌లో దిగ్గజాలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. జిల్లాలో డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో మహిళలు చేస్తున్న ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ జోరుగా సాగుతోంది. ఈ ఉత్పత్తులను సించోరియా, కాల్ గుడి బ్రాండ్ల పేరుతో వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాల్లో చేసే ఉత్పత్తులను సించోరియా, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చేసే ఉత్పత్తులను కాల్ గుడి బ్రాండ్లతో వినియోగదారులకు విక్రయిస్తున్నారు.

ఫొటో షూట్..

ఆన్‌లైన్ మార్కెటింగ్ దిగ్గజ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యాలతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుని ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్రారంభించారు. అందుకోసం ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు ఒంగోలు వచ్చి డ్వాక్రా మహిళలు చేస్తున్న ఉత్పత్తులను ఫొటో షూట్ కూడా చేశారు. ఆ ఫొటోలను ఆయా సంస్థల వెబ్‌సైట్లలో పొందుపరిచారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళలు చేస్తున్న ఉత్పత్తులను ఒక చోటకు చేర్చేందుకు కూడా అధికారులు ఇప్పటికే నిర్ణయించి ఒంగోలు నగరంలోని మెప్మా కార్యాలయం ప్రాంగణంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని మెప్మా కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌ను సెల్లార్ పాయింట్‌గా ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి అందుకు అనుగుణంగా ఆ భవనాన్ని మార్పులు చేశారు. ఒంగోలు నగరంతో పాటు ఇతర మున్సిపాలిటీల్లో, నగర పంచాయతీల్లో సిద్ధం చేసిన ఉత్పత్తులను ఒంగోలుకు తీసుకొచ్చి ఈ సెల్లార్ పాయింట్‌లో ఉంచుతున్నారు. మెప్మా ఆధ్వర్యంలో మొత్తం 126 రకాల ఉత్పత్తులను అనువైనవిగా గుర్తించారు. డీఆర్‌డీఏ పరిధిలోని ఉత్పత్తులు దాదాపు 35 వరకు పరిశీలనలో ఉన్నాయి. రెండు విభాగాలకు సంబంధించి ప్రధానంగా తేనె, మిల్లెట్లతో తయారు చేసిన తినుబండారాలు, రెడీమేడ్ వస్తువులు, ప్లేట్లు, విస్తర్లు, ఊరగాయ పచ్చళ్లు, తినుబండారాలు, బేకరీ ఐటమ్స్, వస్త్రాలు, చీరలు, ఎంబ్రాయిడరీ డిజైన్స్, కలంకారీ దుస్తులు, సంగీత పరికరాలు, జ్యూట్ బ్యాగులు, అలంకరణ వస్తువులు, గోల్డ్ కోటెడ్ ఆభరణాలు, షోకేస్ బొమ్మలు, దేవుళ్లకు సంబంధించిన విగ్రహాలతో పాటు మరి ఎన్నో ఉత్పత్తులు అందుబాటులో ఉంచారు.



మంత్రి సురేష్, రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని ద్వారా సత్కారం పొందుతున్న శ్యామలా దేవి



గుంటూరు విద్యాశాఖ ఆర్‌జేడీ సుబ్బారావు నుంచి బహుమతి అందుకుంటున్న శ్యామల

హర్డిల్స్ పరార్!

- అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్న మహిళా పీఈటీ
- జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు
- విద్యార్థులను తీర్చిదిద్దడంలో సఫలం



కలెక్టర్ దినేష్ కుమార్ నుంచి సన్మానం



మార్కాపురం: క్రీడామైదానం క్రీడాభిమానులతో కిక్కిరిసిపోయింది. 'యూ కెన్ డూ ఇట్' అనే నినాదాలు హోరెత్తుతున్నాయి. 'మహిళగా సత్తా చాటాలి' అని మరకొందరు అరుస్తున్నారు. ఈ ఒత్తిడి కానీ.. అరుపులు గానీ గ్రౌండ్‌లో ఉన్న పీఈటీ శ్యామలా దేవిని ఏమాత్రం కదిలించలేకపోయాయి. ఆమె లక్ష్యం అంతా పరుగుపైనే! ఇలాంటి విజయాలు ఈమెకు కొత్తకాదు. సాధారణంగా పెళ్లైన స్త్రీలకు ఉండే బలహీనతలను అధిగమించి.. అథ్లెట్‌గా అంతర్జాతీయ మైదానాల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న ఈ పీఈటీకి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బెస్ట్ విషెస్ చెప్పాల్సిందే!

• • •

మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పీఈటీగా పనిచేస్తున్న డోలా శ్యామలాదేవి ఒక వైపు కుటుంబాన్ని చక్కబరుస్తూ.. మరో వైపు కేవలం ఉద్యోగ బాధ్యతలే కాకుండా.. క్రీడాకారిణిగా లెక్కకు మించి విజయాలు సాధిస్తుంటే ఎవరు మాత్రం హ్యాట్సాఫ్ చెప్పకుండా ఉంటారు? కఠోర శ్రమ.. ఉన్నత లక్ష్యం ఆమెను అనుక్షణం అప్రమత్తం చేస్తుండటం వల్లే ఈ తరహా విజయాలు అందుకుంటున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. చీరాలకు చెందిన డోలా శ్యామలాదేవికి మార్కాపురం పట్టణానికి చెందిన కాశయ్యతో 1998లో వివాహం జరిగింది. అప్పటికి ఆమె ఇంటర్ మాత్రమే పూర్తి చేశారు. తనకు ఇంకా చదువుకోవాలని ఉందని, క్రీడలపై ఆసక్తి ఉందని భర్తతో చెప్పగానే ఆయన ఏమాత్రం సంకోచించకుండా.. పీఈటీ శిక్షణకు పంపించి కొండంత అండగా నిలిచారు. ఒక వైపు కూలీ పని చేస్తూ భార్య చదువుకు డబ్బులు పంపుతున్న భర్త కష్టాన్ని చూసిన ఆమె ట్రైనింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. 2001 డీఎస్సీలో పీఈటీ టీచర్‌గా సెలక్టు అయ్యారు. 2002 జనవరి 23న ప్రభుత్వ పీఈటీగా ఉద్యోగం సాధించగా.. 2017లో మార్కాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. అక్కడ నుంచి ఆమె వెనుదిరిగి చూడలేదు. ఎందరో విద్యార్థులను ఉన్నత క్రీడాకారులుగా తయారు చేస్తూ వారి భవితకు బాటలు వేస్తున్నారు. ఇక ఇంతటితో తన బాధ్యత తీరినట్లే అని ఏమాత్రం అనుకోలేదు శ్యామలాదేవి. స్వతహాగా తాను క్రీడాకారిణి అయిన సంగతిని మరవలేదు. తన ఫిట్‌నెస్‌ను పెంచుకొని అథ్లెటిక్స్‌లోని వివిధ విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

విజయమే ఆలంబనగా..

- 2019 జనవరిలో గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్, 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో మొదటి స్థానం.
- అక్కడే జరిగిన పోటీల్లో 400 వందల మీటర్ల రీలేలో 2వ బహుమతి, ట్రిపుల్ జంప్‌లో 4వ స్థానం కైవసం.
- 2019 డిసెంబర్‌లో మలేషియాలో జరిగిన 21వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో ట్రిపుల్ జంప్‌లో ఉత్తమ క్రీడాకారిణిగా ఎంపిక.
- ఈ ఏడాది జనవరి 7, 8 తేదీల్లో గుంటూరులో జరిగిన 40వ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో భాగంగా 100 మీటర్ల హర్డిల్స్, ట్రిపుల్ జంప్‌లో మొదటి బహుమతితో సత్తా.
- ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 100, 400 మీటర్ల హర్డిల్స్, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించి జిల్లా గౌరవాన్ని పెంచారు. ఈ ఏడాది మేలో దక్షిణ కొరియాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దుతూ..

మార్కాపురం జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులను క్రీడల్లో తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. 2019లో డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థినులు తమ సత్తా చాటడంలో పీఈటీగా శ్యామలాదేవి విశేష కృషి చేశారు. అలాగే పాఠశాలకు చెందిన విద్యార్థులు పార్వతి, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కాగా.. వాసవి, శిరీష, ఫర్హాన, రమ్యశ్రీ, భవాని, లీలావతి, రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

కమనీయం.. లక్ష్మీనృసింహస్వామి కళ్యాణం



లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మద్రిపూడి: పృథులగిరి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి పండితుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారి కళ్యాణం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల హరినామ స్మరణతో స్వామివారి సన్నిధి మారుమోగింది. తొలుత అర్చకులు నారాయణం వెంకట రమణాచార్యులు, ఆదిశేషాచార్యులు, మురళీకృష్ణమూర్తి చార్యులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామివారి కళ్యాణం తిలకించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో పృథులగిరి చేరుకున్నారు.

ఘనంగా గజోత్సవం

బ్రహ్మోత్సవల్లో భాగంగా మంగళవారం ఎదురుకోల ఉత్సవం, గజోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యలక్ష్మీసహితుడైన నృసింహస్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ఎదురుకోల ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వాములవారి ప్రతిమలను పల్లకిపై ఉంచి మాడ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు వాకా వెంకటరెడ్డి స్వామి వారి పల్లకి మోశారు. కుప్పం పెద కొల్లయ్య, కుప్పం చిన కొల్లారావు కుమారులు, ప్రసాద్, సత్యన్నారాయణ, బరూరి లక్ష్మీనృసింహ శాస్త్రి అన్నదమ్ములు ఉభయదాతలుగా వ్యవహరించారు.



స్వామి వారి పల్లకి మోస్తున్న ప్రముఖులు

మాదకద్రవ్యాల నిర్మూలనే సంకల్పం



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్, వకుల్ జిందాల్

- కళాశాలల్లో డ్రగ్స్ వ్యతిరేక కమిటీలు, డ్రాప్ బాక్స్‌లు
- క్విస్ కాలేజీలో అవగాహనా సదస్సులో ప్రకాశం, బాపట్ల ఎస్పీలు

ఒంగోలు టౌన్: ప్రకాశం, బాపట్ల జిల్లాలను మాదకద్రవ్యాల రహితంగా మార్చడమే లక్ష్యంగా సంకల్పం–డ్రగ్స్ వ్యతిరేక పోరాటం అనే నూతన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎస్పీలు మలికా గర్గ్, వకుల్ జిందాల్ సంయుక్తంగా ప్రకటించారు. స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పలితాలు, చట్టపరమైన శిక్షలను వివరించారు. డ్రగ్స్ వ్యసనం నుంచి బయటపడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. సంకల్పంలో భాగంగా ప్రతి కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక కమిటీలను నియమించి, డ్రాప్ బాక్స్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. హాస్టళ్లలో ఉండి చదుకుంటున్న విద్యార్థులు కొత్త పరిచయాలతో చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు బానిసలై చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని, ఒకసారి డ్రగ్స్ కేసుల్లో పట్టుబడి పోలీసు రికార్డులో పేరెక్కితే భవిష్యత్తులో ఉద్యోగాలు రావడం కష్టమన్నారు. జీవిత లక్ష్యాలను సాధించడం కోసం తగిన ప్రణాళిక నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం డ్రగ్స్ వల్ల కలిగే దుష్పలితాలు, జీవితం మీద చూపించే ప్రభావాన్ని తెలియపరుస్తూ వీడియోలు, పీపీటీలు ప్రదర్శించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే సెబ్ టోల్ ఫ్రీ నంబర్ 14500, డయల్ 100, 112, పోలీసు వాట్సప్ 9121102266కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్)కె.నాగేశ్వరరావు, సెబ్ ఈఎస్ ఆవులయ్య, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, దిశ డీఎస్పీ పల్లపురాజు, క్విస్ కాలేజీ సెక్రటరీ ఎన్ఎస్కే చక్రవర్తి, ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

- 36 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు దోపిడీ

బేస్తవారిపేట: ఇళ్లకు తాళం వేసి యజమానులు పొలంలో పనులకు వెళ్లగా.. దొంగలు చొరబడి భారీగా బంగారం, నగదు కాజేశారు. ఈ ఘటన బేస్తవారిపేట మండలంలోని పందిళ్లపల్లి పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో మంగళవారం పట్టపగలే చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలు–నంద్యాల హైవే పక్కన ఉండే శాంతినగర్‌లో మంగళవారం రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ద్వారకచర్ల బాలగురువారెడ్డి గృహం ఇనుపగేటు తాళం పగలగొట్టారు. ఇంట్లో షెల్ఫ్‌లో దాచిపెట్టిన 30 తులాల బంగారు నగలు, రూ.1.50 లక్షల నగదు దోచుకున్నారు. ఈ ఇంటి పక్కనే బాలగురువారెడ్డి తమ్ముడు మద్దిరెడ్డి గృహంలోకి ప్రవేశించారు. బీరువా పగలగొట్టి ఆరు తులాల బంగారు ఆభరణాలు, కుమారుడి ఫీజు కోసం దాచిపెట్టుకున్న రూ.1.50 లక్షల నగదు, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. మోటార్‌సైకిళ్లపై వచ్చిన ఇద్దరు హెల్మెట్ పెట్టుకుని హైవేరోడ్డు వెంట ఉన్న ఇళ్ల పరిసరాల్లో తిరిగినట్లు చుట్టుపక్కల నివాసం ఉండే చిన్న పిల్లలు చెప్పారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై మాధవరావు పరిశీలించారు. ఒంగోలు క్లూస్‌టీమ్ ఎస్సై శరత్ బాబు, మార్కాపురం క్లూస్‌టీమ్ ఇన్‌చార్జి ఇబ్రహీమ్ వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వేలిముద్రలు సేకరిస్తున్న ఒంగోలు క్లూస్‌టీమ్ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా

సింగరాయకొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో లారీ డ్రైవర్(60) మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్‌వేపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చెన్నై నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ పొన్నండి సుప్పయ్య(60) రోడ్డు మార్జిన్‌లో ఆపి అవతలి వైపు దాటేందుకు ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో కావలి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం సుప్పయ్యను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో సుప్పయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది తమిళనాడు రాష్ట్రంలోని విరుదానగర్ జిల్లా కిల్‌కుడి గ్రామం. కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

మార్కాపురం: చోరీ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి అదనపు న్యాయమూర్తి వి.ఆదినారాయణ తీర్పు చెప్పినట్లు పట్టణ ఎస్సై శశికుమార్ మంగళవారం తెలిపారు. గత ఏడాది నవంబర్ 7న పట్టణంలోని కాలేజీ రోడ్డులో అమరాన్ బ్యాటరీ షాపులో రూ.58 వేలు చోరీ అయ్యాయి. గుంటూరు జిల్లా దాసరిపాలేనికి చెందిన తుపాకుల వెంకటేశ్వర్లును నిందితుడిగా గుర్తించగా, అతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు. నేరాన్ని రుజువు చేయడంలో కృషి చేసిన టౌన్ ఎస్సై శశికుమార్, కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ ఐవీ శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ భాస్కర్‌ను ఎస్పీ మల్లికా గర్గ్ అభినందించారు.